సాక్షి
జనగామ
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



'సహకార' బలోపేతానికి కృషి

పీఏసీఎస్‌ల బలోపేతానికి అధ్యక్షులు, సీఈఓలు కృషి చేయాలని టీజీ కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. - 8లో



ఈత కొలనులు భద్రమేనా!

తల్లిదండ్రులు అన్ని పరిశీలించిన తర్వాతే పిల్లలను ఈత కొలనుల్లోకి పంపాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం $35^0/25^0$

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

కొనేవారేరి..?

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- మినిమం ప్రైజ్ నిబంధనతో నష్టమని ముందుకు రాని ట్రేడర్లు
- ఆలస్యంగా ప్రారంభమైన కొనుగోళ్లు



మార్కెట్‌లో పేరుకుపోయిన ధాన్యం రాశులు

జనగామ: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లలో సందిగ్ధత నెలకొంది. ఈ–నామ్ ద్వారా క్వింటా ధాన్యానికి కనీస ధర రూ.1,850 నిర్ణయించారు. గత ఏడాది నుంచి ఈ నిబంధన వర్తిస్తున్నది. ఇదే పద్ధతిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండగా.. ఈసారి పేచీ పడింది. విదేశాలకు బియ్యం ఎగుమతులు లేక క్వింటాకు రూ.3,700 నుంచి రూ.3,200 వరకు ధర పడిపోయింది. అంతేకాకుండా ఏపీ నుంచి రూ.2వేల లోపు ధరతో ధాన్యం దిగుమతి అవుతుండడంతో జనగామ మార్కెట్ కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది.

జిల్లాలో యాసంగి వరి కోతలు మొదలైనా ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతోంది. రోజుకు 7వేల నుంచి 10వేల బస్తాల ధాన్యం వస్తోంది. మార్కెట్ పరిధిలో 52 మంది ట్రేడర్లు ఉండగా రోజూ ఏడుగురు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అకాల వర్షాల భయంతో రైతులు పచ్చిమీద పంట కోతలు చేపట్టి నేరుగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో తేమ 20 నుంచి 28 శాతం వరకు ఉంటోంది. దీనికి తోడు విదేశాలకు ఎగుమతి చేసే బియ్యం ధరలు పడిపోయాయని, మినిమం ప్రైజ్‌తో కొనుగోలు చేస్తే నష్టమే ఎక్కువ వస్తుందని ట్రేడర్లు ముందుకు రావడం లేదు. ఇటు ట్రేడర్ల సమస్య, అటు సర్వర్ డౌన్ కారణంగా గురువారం మధ్యాహ్నం 2.30 గంటలు దాటినా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. చైర్మన్ శివరాజ్‌యాదవ్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నరేంద్ర చొరవతో ముగ్గురు ట్రేడర్లు మాత్రమే రంగంలోకి దిగారు. 43 మంది రైతుల వద్ద 1,766 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేసి మిగతా సరుకును వదిలేశారు. రైతులు ప్రాధేయపడినా స్పందించలేదు. ఈ–నామ్ ద్వారా క్వింటా ధాన్యానికి రూ.1,880, రూ.1,850, రూ.1,925 ధర పలికింది. కొంతమంది వ్యాపారులు రైతుల అంగీకారం మేరకు క్వింటాకు రూ.1,700 నుంచి రూ.1,750 ధరతో కొనుగోలు చేశారు.

ధాన్యంతో నిండిన మార్కెట్

మార్కెట్‌లోని రెండు కవర్ షెడ్లతో పాటు కల్లాలు ధాన్యంతో నిండిపోయాయి. సుమారు 30వేల బస్తాల వరకు ఉండవచ్చని అంచనా. తిరుమలగిరి, సూర్యాపేట మార్కెట్ల మాదిరిగా మినిమం ప్రైజ్ నిబంధన తొలగించి రైతుకు నష్టం లేకుండా ధర ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలనేది ట్రేడర్ల వాదన. అధికారులు, ట్రేడర్ల మధ్య నెలకొన్న ఈ వివాదంతో కొనుగోళ్లు మందగించి మార్కెట్‌లో ధాన్యం నిల్వలు పెరిగి పోతున్నాయి. రైతులు ఆరబోసుకోవడానికి స్థలం కూడా లేకుండా పోయింది.

మూడు రోజులు సెలవు : చైర్మన్

ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో స్థల ప్రభావం కారణంగా ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. 4న ధాన్యం కొనుగోళ్లు–తరలింపు, 5న జగ్జీవన్‌రామ్ జయంతి, 6న ఆదివారం సాధారణ సెలవు కారణంగా రైతులు మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులు తేవద్దని, 7వ తేదీన కొనుగోళ్లు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఇబ్బంది లేకుండా పర్యవేక్షణ



మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. తేమ ఎక్కువ ఉండడం, ఎగుమతి బియ్యం ధర పడిపోవడంతో మినిమం ప్రైజ్ విషయంలో ట్రేడర్లు కొనుగోలుకు విముఖత చూపుతున్నారు. అయినా ట్రేడర్లను పిలిపించి ధాన్యం కొనుగోలు చేయించాం. ట్రేడర్ల విజ్ఞప్తిని అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- శివరాజ్‌యాదవ్, మార్కెట్ చైర్మన్, నరేంద్ర, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

పొట్టి ధాన్యం కొంటలేరు



రెండెకరాల్లో వరి సాగు చేసిన. జనగామ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ షాపు యజమాని 553తోపాటు మరో రకానికి చెందిన నాలుగు విత్తన ప్యాకెట్లు ఇచ్చాడు. అందులో దొడ్డురకమని పొట్టి రకానికి చెందిన విత్తనాలు ఇచ్చాడు. ఆ ధాన్యం మార్కెట్‌కు తీసుకు వస్తే కొనేవారు లేరు. ఈసారి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో 25 బస్తాల దిగుబడి తగ్గింది.

- వంగాల రవీందర్,
ఎర్రగొల్లపహాడ్(జనగామ)

ధాన్యం బాగున్నా ధర పెట్టడంలేదు



రెండు రోజుల క్రితం మార్కెట్‌కు 15 బస్తాల ధాన్యం తీసుకు వచ్చిన. కొనుగోలు చేసేవారే లేకుండా పోయారు. ధాన్యం బాగున్నా క్వింటాకు రూ.1,750 ధరతో అడిగారు. రూ.2వేలకు తీసుకోవాలని కోరినా పట్టించుకోలేదు. అసలే సాగునీరు లేక పంట ఎండి దిగుబడి తగ్గింది. చేతికొచ్చిన గింజలు అమ్ముకుందామంటే అడ్డగోలు ధర అడుగుతున్నరు.

- దేగల యాదగిరి,
మాణిక్యాపురం(లింగాలఘణపురం)

రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి



జాతర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఆలయ పరిసరాల్లో శుభ్రత, తాగునీరు ఏర్పాటు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, డీపీఓ స్వరూప, ఈఓ మోహన్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంధ్యారాణి, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్ కప్పిన ధాన్యం కుప్పలపై కురుస్తున్న వర్షం



అకాల వర్షం.. ఆగమాగం

- మార్కెట్‌లో స్వల్పంగా తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యం రాశులు

జిల్లాలో గురువారం కురిసిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. జనగామ మార్కెట్‌లో ధాన్యం నిల్వలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఈ క్రమంలో సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమైంది. అప్రమత్తమైన రైతులు డోజర్లు, జేసీబీలతో పాటు రెక్కల కష్టాన్ని నమ్ముకుని ధాన్యంతోపాటు కాటన్ యార్డులోని మక్కలను ఒక్కచోటకు చేర్చి టార్పాలిన్ కవర్లు కప్పారు. మార్కెట్ నిండా ధాన్యం ఉండడంతో అక్కడక్కడా వర్షానికి తడిసింది. భారీ వర్షం కురిసినా నష్టం జరగకుండా ఉండేలా చైర్మన్‌తో పాటు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– జనగామ

పవర్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక

కేయూ క్యాంపస్ : కాశ్మీర్ యూనివర్సిటీలో ఈ నెల 4 నుంచి నిర్వహించే ఆల్‌ఇండియా ఇంటర్ వర్సిటీ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు పురుష, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య గురువారం తెలిపారు. పురుషుల జట్టులో పి.విశాల్, ఎం.అమన్, ఎస్.పోతురాజు, వి.వెకంటేష్, మహిళా జట్టులో సీహెచ్.రమ, బి.చిన్మయి, జి.శృతి ఉన్నారు. కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఖమ్మం) డైరెక్టర్ డాక్టర్ జె.జేథ్యా మేనేజర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.

న్యూస్‌రీల్

దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ రిజ్వాన్ బాషా



జనగామ రూరల్: దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రం హైదరాబాద్‌రోడ్డున ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం.. దొరల పాలనను ఎదిరించి పోరాటాలకు మార్గదర్శి అయ్యాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర వీరాస్వామి, కురుమ కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ బాధ్యతల స్వీకరణ



జనగామ రూరల్: జనగామ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడు దండెబోయిన హరిప్రసాద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఇరిగి అశోక్, మహిళా కార్యదర్శి సునీతరాణి, కోశాధికారి ఆలే బాలరాజు, లైబ్రరీ సెక్రటరీ అన్నరుల్లా, కల్చరల్–స్పోర్ట్స్ సెక్రటరీ రెడ్డబోయిన రాజు, కార్యవర్గ సభ్యులు చరణ్, శ్రీమాన్, జోత్స్న, రవికుమార్, దాసుతో ఎన్నికల అధికారి శ్రీరామ్ శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులు దొమ్మాట సురేష్, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు



జనగామ : రైతులు ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. గురువారం మార్కెట్ యార్డులో ఐకేపీ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని తూర్పార బట్టి, తేమ శాతం తగ్గిన తర్వాత కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఐకేపీ కేంద్రంలో రైతులకు అవసరమైన వసతులు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నరేందర్, ఏపీఎం కవిత, వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు, డైరెక్టర్లు తోటకూరి రమేశ్, బాష్మియా, శ్రీనివాస్, బస్సీనాయక్, నర్సింగరావు, బండ కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సీసీ శ్రీనివాస్, వీఓ అధ్యక్షురాలు దేవేంద్ర పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్ స్టేషన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. నగరంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్ ఓనర్లు, డ్రైవర్లు ఇక్కడ తమ వాహనాలకు చార్జింగ్ చేసుకోవచ్చని సూచించారు. రైల్వే అధికారుల అనుమతితో ఇండో ఫాస్ట్ ఎనర్జీ కంపెనీ వారు ఈ స్వాప్ పాయింట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన యంత్రాలను కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ ప్రహరీ వద్ద భద్రపర్చినట్లు తెలిపారు. త్వరలో కాజీపేట జంక్షన్‌లో అధికారికంగా ప్రారంభించి వాహనదారులకు ఈచార్జింగ్ పాయింట్‌ను వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు వివరించారు.

యూడీఐడీ నమోదులో తప్పులు ఉండొద్దు



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఇతర అధికారులు

- ఇసుక తరలింపు ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేయాలి
- సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: యూనిక్ డిసెబిలిటీ ఐడీ(యూడీఐడీ) కార్డుల జారీ ప్రక్రియలో తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. యూడీఐడీ కార్డులు, సదరం (21డీ) క్యాంపులపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి, సెర్ప్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి ఎంపీడీఓ ఎంపీఈఓ, ఏపీఎం, సీసీ, మీ–సేవా సెంటర్ ఆపరేటర్, దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. www.r-wavaambancar.gov.in వెబ్‌సైట్ ద్వారా యూడీఐడీ కార్డుల జారీకి కొత్త దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోర్టల్ ద్వారా పీడబ్ల్యూడీ లాగిన్ మాడ్యూల్‌లో దివ్యాంగులకు సంబంధించిన వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. అనర్హులకు డిసెబిలిటీ కార్డులు జారీ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ధాన్యం సెంటర్లు, ఇందిరమ్మ ఇళ్లపై..

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్మాణాలకు మార్కింగ్, గ్రౌండింగ్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రజాపాలన గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి చేపట్టిన సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేసి పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలింపులో అక్రమాలకు చోటివ్వొద్దని, ప్రతీ ట్రాక్టర్‌కు జీపీఎస్ సిస్టం అమర్చాలని పేర్కొన్నారు. ఇసుక తరలింపు వివరాలు జీపీ రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసే 157 కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, గన్నీ బ్యాగులు, ఎలక్ట్రానిక్ కాంటాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న వృద్ధాప్య, వితంతు, శాశ్వత వలస పింఛన్లు, స్వయం సహాయక సంఘాల మహిళలకు బీమా దరఖాస్తులను ఈనెల 10 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే రెండు జతల యూనిఫామ్ కొలతల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించి స్టిచ్చింగ్ చేసేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఉపాధి హామీ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ మరింత వేగం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తొద్దని, నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో డీఆర్డీఓ వసంత, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులంటూ అబద్ధపు ప్రచారం

- 'కడియం'పై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పల్లా'

రఘునాథపల్లి: రూ.800 కోట్లతో అభివృద్ధి పనులంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. ఎనిమిది పైసలు కూడా తీసుకురాలేదని జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధ్యక్షతన జరిగిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ 5 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని, స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధితోపాటు ఇక్కడి భూములకు సాగునీరు అందిందని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు చెమటోడ్చి గెలిపిస్తే.. మోసం చేసి పార్టీ మారిన కడియం శ్రీహరికి గుణపాఠం చెప్పే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. రజతోత్సవ సభకు ఘన్‌పూర్ నుంచి 30 వేల మందికి తగ్గకుండా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నాయకులు బాల్నె సిద్ధిలింగం, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, సేవెల్లి సంపత్, ఆకుల కుమార్, ముసిపట్ల విజయ్, వై.కుమార్‌గౌడ్, ఎడవెల్లి కృష్ణారెడ్డి, మనోజ్‌రెడ్డి, మారపాక రవి, రాజన్‌బాబు, శెట్టి మాధవరావు, ఊడ్గుల భాగ్య, దొనికల రమాదేవి, బొంగు ఐలయ్య, లొక్కుంట్ల సృజన్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం.. నేతలు రాక ఆలస్యం

- రెండు రోజులపాటు కొనసాగిన ప్రారంభవేడుకలు
- లబ్ధిదారుల బారులు.. రేషన్ దుకాణాల వద్ద సందడి
- ఉమ్మడి వరంగల్‌లో 32.61లక్షల మంది కార్డుదారులు
- 2,315 దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ.. కలెక్టర్‌లు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ



మడికొండ రేషన్‌షాపు వద్ద క్యూలో ఉన్న కార్డుదారులు

సాక్షిప్రతినిధి, వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకానికి ప్రొటోకాల్ సమస్య తప్పలేదు. వాస్తవానికి ఉగాది కానుకగా ప్రకటించిన ఈ పథకాన్ని ఈనెల 1న అన్ని గ్రామాల్లో ప్రారంభించాల్సి ఉంది. వివిధ కారణాలు, ప్రభుత్వ పరమైన కార్యక్రమాల వల్ల ప్రజాప్రతినిధులు కొన్నిచోట్ల హాజరు కాలేదు. దీంతో కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు, అధికారులు కూడా ప్రారంభించే సాహసం చేయలేదు. ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు అధికారికంగా ప్రారంభించాకే పంపిణీ చేయాలనుకుంటున్నట్లు అధికారులు పరోక్ష సంకేతాలు కూడా ఇచ్చారు. దీంతో వరంగల్ తూర్పు, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ఒకటి, రెండు రోజుల ఆలస్యంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మొదలు కాగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు రేషన్ దుకాణాల ఎదుట బారులుదీరి తీసుకెళ్తున్నారు.

ఉమ్మడి వరంగల్ పరిధి ఆరు జిల్లాల్లో 2,315 రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా 20,958 మెట్రిక్ టన్నుల బియ్యం పేద ప్రజలకు అందజేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఉగాది నుంచి రేషన్‌కార్డులపై సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం పట్ల లబ్ధిదారుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రేషన్‌షాపుల ఎదుట సందడే సందడి..

గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్లతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సన్న బియ్యం కోసం లబ్ధిదారులు ఉదయం నుంచే రేషన్‌షాపులకు చేరుకుంటున్నారు. మంగళవారం నుంచి గురువారం రేషన్ దుకాణాల్లో అధికారికంగా పంపిణీ ప్రారంభం కాగా.. ఉదయం 8 గంటల నుంచే రేషన్‌షాపుల వద్ద భారీ సంఖ్యలో లబ్ధిదారులు క్యూలలో నిల్చుంటున్నారు. దీంతో రేషన్ షాపుల వద్ద ఈ తరహాలో సందడి చూసి చాలా రోజులైందన్న ఆశ్చర్యాన్ని డీలర్లు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు లేదా సన్న బియ్యం స్టాక్ ఉన్నంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని డీలర్లు చెప్తున్నారు.

మంచి స్పందన ఉంది..



సన్నబియ్యం పథకం అమలుపై ప్రజల్లో మంచి స్పందన ఉంది. పనులకు పోయేటోళ్లు రేషన్ దుకాణం తెరవక ముందే వచ్చి క్యూలో ఉండి తీసుకెళ్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు డీలర్లకు గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.300 చొప్పున కమీషన్ హామీ అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నాం.

- ఏలూరి యాకన్న, రేషన్‌డీలర్, శాతాపురం

జిల్లాల వారీగా రేషన్ దుకాణాలు, కార్డులు, బియ్యం సరఫరా పంపిణీ ఇలా..

జిల్లా	దుకాణాలు	కార్డులు	లబ్ధిదారులు	బియ్యం పంపిణీ (మె.టన్నుల్లో)
హనుమకొండ	414	2,28,143	6,75,246	4,051.476
వరంగల్	509	2,66,429	7,94,087	5,014.541
జనగామ	335	1,61,472	4,85,164	3,094.690
మహబూబాబాద్	558	2,41,012	7,03,550	4,511.000
జేఎస్‌భూపాలపల్లి	277	1,23,508	3,50,527	2,276.520
ములుగు	222	91,737	2,52,348	1,650.000

ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

జనగామ రూరల్: జిల్లాలో ఎండిన పంటలపై అధికారులు సర్వే చేపట్టి ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఏఓ ఆండాలుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కాల్వలు పూర్తి చేయడంతో పాటు దేవాదుల ప్రాజెక్టు నుంచి వరద కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపి రైతుల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. నాయకులు మాచర్ల సారయ్య, మంగ బీరయ్య, ఉర్సుల కుమార్, బోడ రాములు తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు 'స్పాట్' డ్యూటీలు

- ఒక్క బచ్చన్నపేట నుంచే 19 మందికి..
- సంబంధం లేని విధుల కేటాయింపుపై విమర్శల వెల్లువ

జనగామ: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ విధులు కేటాయించారు. ఇందులో కొంతమందికి ఇంటర్ పరీక్షల డ్యూటీ ముగియగానే పదో తరగతి పరీక్షలకు ఇన్విజిలేషన్ వేశారు. ఇప్పుడు మళ్లీ పదో తరగతి పేపర్ వాల్యుయేషన్ పేరిట సంబంధం లేకుండా ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు స్పెషల్ అసిస్టెంట్ డ్యూటీలు వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేస్తే.. ఎస్జీటీలను ఇన్విజిలేషన్, వాల్యువేషన్ కోసం పంపించడం ఏమిటని మేధావి వర్గం ప్రశ్నిస్తోంది. మారుమూల గ్రామాల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయగా.. తల్లిదండ్రులు స్కూళ్లపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే తమ పిల్లలను పంపిస్తున్నారు. ఇన్విజిలేషన్, స్పాట్ వాల్యువేషన్ పేరిట కొత్త టీచర్లకు వరుస డ్యూటీలు వేస్తూ విద్యార్థులకు చదువులకు ఆటంకం కలిగిస్తుంటే ఆ నమ్మకం సడలే ప్రమాదం ఉంది. మరోవైపు జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల కోసం క్యాంపేయిన్ చేస్తుండగా.. ప్రభుత్వం ఎస్జీటీలను అదనపు డ్యూటీల పేరిట పంపిస్తే.. స్కూళ్లు ఎలా నిండుతాయని అంటున్నారు. పేపర్ వాల్యుయేషన్‌కు ఆయా సబ్జెక్టుల టీచర్లతో పాటు నాన్ టీచింగ్ ఉద్యోగులను తీసుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



బచ్చన్నపేట మండలం నుంచి స్పాట్ డ్యూటీలు కేటాయించిన జాబితా

కాజీపేట రైల్వే సమస్యలను ప్రస్తావించిన ఎంపీ కావ్య


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

కాజీపేట రూరల్/హన్మకొండ చౌరస్తా : కాజీపేట లోకోరన్నింగ్ డిపో సిబ్బంది కొరత, పోస్టుల తరలింపుపై పార్లమెంట్‌లో గురువారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రస్తావించారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుపై అధికారులు పక్షపాత ధోరణి చూపుతున్నారని, లోకోరన్నింగ్ స్టాఫ్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, ప్రస్తుతం కాజీపేటలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని, దీంతో కాజీపేటలో ఉన్న ఉద్యోగులపై అధిక పనిభారం పడుతుందని ప్రస్తావించారు. రైల్వేమంత్రి సానుకూలంగా పరిశీలించి లోకోరన్నింగ్ స్టాఫ్ ఖాళీల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధితో పాటు వివిధ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులపై వినతిపత్రం అందజేశారు. భూపాలపల్లి పట్టణానికి బైపాస్‌రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలోని నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్లు, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కేంద్ర మంత్రి వెంటనే డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎంపీ కావ్య తెలిపారు.

నవోదయ విద్యాలయాలు ఇవ్వండి..

● ఎంపీ పోరిక బలరాంనాయక్


మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్ : తమ గిరిజన, ఆదివాసీలకు మూడు నవోదయ విద్యాలయాలు ఇవ్వాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కోరారు. పార్లమెంట్‌లో జీరో అవర్ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ గురువారం మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. తన నియోజకవర్గంలో గిరిజన, ఆదివాసీలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ ఉంటారని, వారు విద్యకు దూరంలో ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన, ఆదివాసీ ప్రజలు అభివృద్ధి చెందాలంటే చదువుకోవడం అవసరమన్నారు. అందుకు అనుగుణంగా మూడు కొత్త నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేసి గిరిజన, ఆదివాసీ, ఏజెన్సీ ప్రజలను చదువుకు దగ్గర చేసి వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

కొలనులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు



⊃ గతేడాది వేసవి సెలవుల్లో కొందరు చిన్నారులు సరదాగా తిమ్మాపురం శివారు బెస్తం చెరువులోకి వెళ్లారు. ఇక్కడ ఈత రాక చెరువు గుంతలో మునిగి లెనిన్‌నగర్‌కు చెందిన ఓ బాలుడు మృతి చెందాడు.

⊃ గతేడాది వేసవి సెలవుల్లో కొందరు చిన్నారులు తూర్పుకోట శివారులోని అగర్త చెరువులోకి వెళ్లారు. అయితే సదరు చిన్నారుల్లో ఏ ఒక్కరికీ ఈత రాదు. ఇందులో ఓ బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఇలా ఈత రాకుండా చెరువుల్లోకి వెళ్లొద్దని పోలీసులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను గమనించాలని వారు కోరుతున్నారు. ఈత నేర్చుకోవాలనుకునే చిన్నారులు, పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈత కొలనులు భద్రమేనా!



వేసవి ఉపశమనం..కారాదు విషాదం

- చాలా చోట్ల శిక్షకులు, సిబ్బంది కరువు
- ప్రమాణాలు పాటిస్తున్న వాటినే ఎంచుకుంటే మేలు
- జాగ్రత్తలు తీసుకుంటూ ఈత నేర్చుకోవాలంటున్న నిపుణులు

ఖిలా వరంగల్: వేసవి ఎండలు మండుతున్నాయి. దీంతో భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ చెరువులు, కుంటల్లో ఈత కొడుతూ సేద దీరుతారు. ఇదే క్రమంలో చిన్నారులు వేసవిలోనే ఈత నేర్చుకుంటారు. ఇందుకు కొందరు వ్యవసాయ భూములు, కుంటలు, చెరువుల వద్దకు వెళ్తుంటారు. ఇలాంటి చోట తల్లిదండ్రులు, ఈత వచ్చిన వారి పర్యవేక్షణ తప్పని సరిగా తీసుకోవాలి. వరంగల్ నగర వాసులైతే ప్రభుత్వ, ప్రైవేట్ ఈత కొలనుల(స్విమ్మింగ్ పూల్)కు వెళ్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మాత్రమే ఈత కొలనులు ఉన్నాయి. ఈ క్రమంలో అందులో చిన్నారుల భద్రతాపరంగా అన్ని సౌకర్యాలు, నిష్ణాతులైన శిక్షకులు, సిబ్బంది ఉన్న వాటినే ఎంచుకోవాలి. లేదంటే ఈత నేర్చుకునే క్రమంలో చిన్నారులు ప్రమాదానికి గురైతే విషాదంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.

జిల్లా కేంద్రాల్లోనే ఈత కొలనులు

వేసవి సెలవుల్లో నగర ప్రాంత చిన్నారులు ఉదయం, సాయంత్రం స్థానిక ఈత కొలనుల్లో శిక్షణకు వస్తున్నారు. కొందరు సాధన చేస్తున్నారు. మరికొందరు కోచ్‌ల పర్యవేక్షణలో నేర్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈత కొలనులు కేవలం జిల్లా కేంద్రాల్లోనే ఉన్నాయి. మిగతావన్నీ ప్రైవేట్ కొలనులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆధీనం ఉన్న వాటి కన్నా ప్రైవేట్ ఈతకొలనులే ఎక్కువ ఉన్నాయి. వరంగల్, హనుమకొండలో మొత్తంగా రెండే ఉండగా.. జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో ఒకటి చొప్పున ఈతకొలనులు ఉన్నాయి. అయితే చాలా ప్రైవేట్ ఈతకొలనులు వద్ద నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శిక్షణార్థుల పర్యవేక్షణలో ..

ఈతకొలను నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్) ధ్రువపత్రం ఉన్న శిక్షకులు, కనీసం నలుగురు అనుభవం ఉన్న లైఫ్ గార్డులు, లైఫ్ సేవర్లను నియమించుకోవాలి. చాలా చోట్ల నిపుణులైన కోచ్‌లు లేరు. కేవలం లైఫ్ సేవర్, లైఫ్ గార్డు ధ్రువపత్రాలున్న వారితోనే ఈతకొలునులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నారులకు చర్మ వ్యాధులు రాకుండా, ఈతకొలనుల్లో మలినాలు లేకుండా కెమికల్‌తో నిత్యం శుద్ధి చేయాలి. ఈత కొలనుకు ఇరువైపులా తాడు, ట్యూబ్‌లు, వెదురు కర్రలు అందుబాటులో ఉంచాలి. ఎవరైనా మునిగితే వెంటనే తాళ్లు నీటిలోని విసిరి, వెదురుకర్ర అందించి పైకి లాగేందుకు అవకాశం ఉంటుంది. ప్రైవేట్ ఈతకొలనుల్లో భద్రత పరంగా అన్ని ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో డీఎస్‌ఏ అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ముంది. తల్లిదండ్రులు కూడా అన్ని పరిశీలించాకే పిల్లలను ఈతకొలనుల్లోకి పంపించాలి. చిన్నారులు చెవులు, కళ్లలోకి నీరు పోకుండా క్యాప్ కళ్ల జోడు వాడాలి. ఈత నేర్చుకునేందుకు ట్యూబ్‌లు వాడాలి. కొలను నిర్వాహకులు గంటలకు రూ.100 నుంచి రూ.150 వరకు రుసుం తీసుకుంటున్నారు. నెలకైతే చిన్నారులకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వరకు తీసుకుంటున్నారు.

పిల్లలు ఈ విషయాలు గుర్తుపెట్టుకోవాలి..

ఈత రాని పిల్లలు తప్పకుండా రబ్బరు ట్యూబ్‌లను కటుకుని పెద్దలు, శిక్షణార్థుల పర్యవేక్షణలోనే నీటిలోకి దిగాలి. నీటి కొలనులో గట్టుపై నుంచి దూకడం వంటివి చేయొద్దు. అనుభవజ్ఞులు ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. హెచ్చరిక బోర్డులున్న చోట అసలు నీటిలోకి దిగొద్దు. లైఫ్ జాకెట్లు, బెండుతో తయారు చేసిన వస్తువులను కట్టుకుని మాత్రమే నీళ్లలో దిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

నీటిలోకి దిగి నేర్పించాలి



శిక్షకులు చిన్నారులతో పాటే నీళ్లలోకి దిగి ఈత నేర్పించాలి. కొలనులో ఉన్నంత సేపు ప్రతీ చిన్నారిని గమనిస్తూనే ఉండాలి. ఏమరుపాటుగా ఉంటే చిన్నారులు ట్యూబ్ నుంచి జారి పోయే ప్రమాదం ఉంటుంది. నిత్యం సాధన చేస్తే వారం పదిరోజుల్లో ఈత నేర్చుకుంటారు.

- డాక్టర్ రవీందర్, శివనగర్, వరంగల్

స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలి



చెరువులు, కాల్వలు, ఈత కొలనుల వద్ద నిఘా పెట్టాం. ఈత కొట్టే సమయాన స్వీయ జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు తప్పవు. తల్లిదండ్రులు, శిక్షణార్థుల పర్యవేక్షణలో మాత్రమే పిల్లలను కొలను, జలాశయాల్లో స్నానం చేయించాలి. ఎన్ఐఎస్ ధ్రువ పత్రం ఉన్న నిష్ణాతులైన ఇద్దరు శిక్షకులను నియమించుకోవాలి. చిన్నారులు ప్రమాదాల బారిన పడకుండా కంటికి రెప్పలా కాపాడాలి.

- నందిరాంనాయక్, ఏసీపీ, వరంగల్

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య
- పార్థసారథి హత్యకు రూ.5లక్షల సుపారీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు బోరింగ్‌తండా సమీపంలో గత నెల 31వ తేదీన అర్ధరాత్రి హత్యకు గురైన పార్థసారథి కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భార్య.. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిందని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఈ మేరకు గురువారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని జగదీశ్ కాలనీలో నివాసం ఉండే తాటి పార్థసారథికి స్వప్నతో వివాహం జరగగా వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వప్నకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏటపాక మండలం నెల్లిపాకలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సార్లాం వెంకట విద్యాసాగర్‌తో పరిచయం ఉంది. స్వప్న తల్లిగారి ఇంటి ప్రాంతంలో వెంకట విద్యాసాగర్ ఇల్లు అద్దెకు తీసుకుని ఉండగా 2016లో స్వప్నకు పరిచయమయ్యాడు. అప్పటి నుంచి వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం పార్థసారథికి తెలియడంతో దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. పార్థసారథి హెచ్చరించినా స్వప్న పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే పార్థసారథికి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి ఎంజేపీలో హెల్త్ సూపర్‌వైజర్ ఉద్యోగం రాగా గతేడాది ఫిబ్రవరి నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. సెలవుల సమయంలో ఇంటికి వెళ్లి వస్తుండగా అప్పుడప్పుడు స్వప్నకు వీడియో కాల్ చేసి మాట్లాడేవాడు. అయితే వివాహేతర సంబంధానికి భర్త అడ్డు ఉన్నాడని, అతడిని ఎలాగైనా అంతమొందించాలని స్వప్న తన ప్రియుడు వెంకట విద్యాసాగర్‌కు చెప్పింది. దీంతో వెంకట విద్యాసాగర్.. కొత్తగూడెం మండలానికి చెందిన తెలుగూరి వినయ్‌కుమార్, శివశంకర్, ఏటపాక మండలానికి చెందిన వంశీతో మాట్లాడి పార్థసారథిని హత్య చేయించాలని పథకం రచించించారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులకు రూ. 5 లక్షలు సుపారీగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉగాది, రంజాన్ సెలవుల కోసం పార్థసారథి కొత్తగూడెం వచ్చి మార్చి 31వ తేదీన సాయంత్రం దంతాలపల్లికి వెళ్లే క్రమంలో కొత్తగూడెంలో దంపతులు షాపింగ్ చేశారు. అనంతరం పార్థసారథి తన బైక్‌పై బయలుదేరాక స్వప్న వెంటనే వెంకట విద్యాసాగర్‌కు ఫోన్ చేసి తన భర్త వెళ్తున్న సమాచారం తెలిపింది. దీంతో సుపారీ గ్యాంగ్ ఓ కారును అద్దెకు తీసుకుని పార్థసారథిని వెంబడిస్తూ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు బోరింగ్‌తండా సమీపంలోకి చేరుకోగానే అడ్డగించి దారుణంగా హత్య చేశారు. ఈ కేసులో పార్థసారథి భార్య స్వప్న, ప్రియుడు వెంకట విద్యాసాగర్‌ను అరెస్ట్ చేయగా వినయ్‌కుమార్, శివశంకర్, వంశీ పరారీలో ఉన్నారని తెలిపారు. అదే విధంగా ఏడాది క్రితం పార్థసారథిపై దాడి జరిగిన ఘటనలో రెక్కీ నిర్వహించినట్లు కూసం లవరాజు అనే వ్యక్తిని గుర్తించగా అతడు కూడా పరారీలో ఉన్నారన్నారు. కాగా, కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు సర్వయ్య, సూర్యప్రకాశ్, హథీరాం,నరేందర్, రవికుమార్, ఎస్సైలు దీపిక, మురళీధర్, సతీశ్, ఐటీకోర్ పీసీ సుమన్, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందం సభ్యులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

దశదినకర్మకు వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి
- ఇద్దరికి గాయాలు
- నల్లబండ సమీపంలో ఘటన


ఉప్పలమ్మ (ఫైల్)

జఫర్‌గఢ్: బంధువు దశదినకర్మకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఓ వృద్ధురాలు మృత్యుఒడికి చేరింది. రోడ్డుపై ఒక్కసారిగా కుక్కలు అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం జఫర్‌గఢ్ శివారు నల్లబండ సమీపాన కల్వర్టు వద్ద జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని ఉప్పుగల్లులో తమ బంధువు గాదెపాక సాయమ్మ దశదినకర్మకు హాజరయ్యేందుకు వర్ధన్నపేట మండలం దివిటిపల్లి గ్రామానికి చెందిన జోగు ఉప్పలమ్మ (65), తన చెల్లి జోగు ఎల్లమ్మ, కంజర్ల దయాకర్ ద్విచక్రవాహనంపై బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో జఫర్‌గఢ్ శివారు నల్లబండ సమీపాన కల్వర్టు వద్ద కుక్కలు ఒక్కసారిగా అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి వాహనంపై నుంచి ముగ్గురు కిందపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే తీవ్రంగా గాయపడిన ఉప్పలమ్మ మృతి చెందింది. ఎల్లమ్మ, దయాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు.

బాలికపై లైంగికదాడి.. నేరస్తుడికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : బాలిక (12) పై లైంగికదాడికి పాల్పడి ఆ చిన్నారి గర్భం దాల్చడానికి కారణమైన గీసుకొండ మండలం మనుగొండకు చెందిన చాపర్తి సాంబయ్యకు జీవిత కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా (పోక్సో కోర్టు) జడ్జి ప్రేమలతారెడ్డి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2024, సెప్టెంబర్ 27న కడుపునొప్పి లేస్తోందని బాధిత బాలిక తన తల్లికి తెలుపగా నర్సంపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి పరీక్షించారు. ఇందులో గర్భవతి అని తేలింది. దీనిపై బాలికను తల్లి ప్రశ్నించగా గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య అని తెలిపింది. 2024 మేలో తాను జామకాయల కోసం వెళ్లిన సమయంలో తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని బాలిక తెలిపింది. తల్లి ఫిర్యాదు మేరకు గీసుకొండ పోలీసులు సాంబయ్యపై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడు సాంబయ్యకు జీవిత ఖైదు, రూ. లక్ష జరిమానా విధిస్తూ జడ్జి ప్రేమలతారెడ్డి తీర్పు వెల్లడించారు. జరిమానా డబ్బులతోపాటు బాధితుల నష్టపరిహారం చెల్లింపు పథకం కింద న్యాయసేవాధికార సంస్థ బాధితురాలికి రూ.8 లక్షలు చెల్లించాలని తీర్పులో ఆదేశించారు.

8వ తేదీ నుంచి 12 రైళ్ల సర్వీస్‌లు రద్దు

కాజీపేట రూరల్ : నార్త్ ఇండియా రాయ్‌పురా వద్ద గల కొటార్లియా (కేఆర్ఎల్) రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ రైల్వే వర్క్స్ కారణంగా కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే సికింద్రాబాద్–దర్భాంగా–సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లను రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు గురువారం తెలిపారు. సికింద్రాబాద్–దర్భాంగా జంక్షన్ (17007) ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 8, 12, 15, 19, 22వ తేదీల్లో రద్దు చేసినట్లు, అదేవిధంగా దర్భాంగా జంక్షన్–సికింద్రాబాద్ (17008) ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 11, 15, 18, 22, 25వ తేదీల్లో రద్దు చేసినట్లు రైల్వే ఎంక్వైరీ కౌంటర్ వద్ద డిస్‌ప్లే చేశారు.

ఫ్రస్టేషన్‌లో బీఆర్ఎస్, బీజేపీ

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు ఫ్రస్టేషన్‌లో ఉన్నాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని, హెచ్‌సీయూ పక్కన ఉన్న భూములపై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ భూములు ప్రభుత్వానివేనని హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు నిధులు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నామని, రాష్ట్రానికి అప్పులు పుట్టే పరిస్థితి లేదని, కేంద్ర మంత్రులు పరిపాలనపై కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ సన్నబియ్యం కిలో రూ.40 అయితే రూ.30 కేంద్ర ప్రభుత్వం ఇస్తే, రూ.10 మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని, కనీసం అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గు చేటని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హెచ్‌సీయూ పక్కనున్న భూములు ప్రభుత్వానివేనని చెప్పిన కేసీఆర్, ఇప్పుడు అదే నాయకులు ఆ భూములు ప్రభుత్వానివి కావని అనడంలో రాజకీయం తప్ప మరొకటి లేదని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడంతో ఇప్పుడు ఎక్కడికెళ్లినా అప్పు పుట్టే పరిస్థితి లేదని తెలిపారు. ఆ భూములను అమ్మడం ద్వారా వచ్చే డబ్బుతో పేదల సంక్షేమానికి ఉపయోగించాలని ప్రయత్నం చేస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, ఎర్రబెల్లి శరత్,కూనూరు రాజు, రొండి రాజు, పాషా పాల్గొన్నారు.

'సహకార' బలోపేతానికి కృషి చేయాలి

● టీజీ కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న టీజీ కాబ్ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అధ్యక్షులు, సీఈఓలు కృషి చేయాలని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. తెలంగాణ సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధారిత వ్యవస్థ, సహకార సంఘాల అభివృద్ధిపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతానికి తీసుకున్న నిర్ణయంలో భాగంగా రాష్ట్ర సహకార శాఖ శిక్షణా తరగతులు నిర్వహించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. సహకార సంఘాలు వ్యాపారాలు విస్తరించుకుని రైతు ఉత్పత్తిదారుల సంస్థల మాదిరి పని చేయాలని, తద్వారా లాభాలు గడించాలన్నారు. వరంగల్ డీసీసీబీ టర్నోవర్ రూ.870 కోట్ల నుంచి రూ. 2,229 కోట్లకు చేరుకుందన్నారు. నిరార్థక ఆస్తులను 7.55 శాతం నుంచి 2.21 శాతానికి తీసుకొచ్చామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 19 శాఖలు ఉండగా వీటిని 32కు పెంచి సేవలు విస్తరించామన్నారు. నందనం సొసైటీ ద్వారా సూపర్ మార్కెట్‌ను విజయవంతంగా నడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ ఎండీ కె.వి.ఎస్.అన్నపూర్ణ, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లా సహకార అధికారులు సంజీవరెడ్డి, నీరజ, రాజేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వాల్యానాయక్, వెంకటేశ్వర్లు, సర్దార్ సింగ్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు ఎన్నమనేని జగన్ మోహన్ రావు, కాకిరాల హరిప్రసాద్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

మరోసారి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- 1,3,5 సెమిస్టర్లలో ఫెయిలైన వారికి సదావకాశం
- నేడు పరీక్ష ఫీజు నోటిఫికేషన్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి లో ఉమ్మడి వరంగల్ జిల్లా, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ కోర్సుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు మరోసారి నిర్వహించా లని పరీక్షల విభాగం అధికారులు నిర్ణయించారు. కొన్నినెలల క్రితం ఆయా సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాక మార్చి 4న ఫలితాలు వెల్లడించిన విష యం తెలిసిందే. ఉత్తీర్ణత శాతం తక్కువ వచ్చింది. ఈ క్రమంలో ఆయా సెమిస్టర్ల పరీక్షలు మరోసారి నిర్వహించాలని యూనివర్సిటీ అధికారుల దృష్టికి కొందరు తీసుకెళ్లారు. ఒక విధంగా దీనిని సప్లిమెంటరీ పరీక్షలు భావించవచ్చు. ఈ పరీక్షలను ఈ నెల మూడో వారం నుంచి నిర్వహించబోయే డిగ్రీ కో ర్సుల 2,4, 6 సెమిస్టర్ పరీక్షలతోపాటు జరపాలని నిర్ణయించారు. శుక్రవారం పరీక్ష ఫీజు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. సెమిస్టర్ విధానం వచ్చాక ఒకసారి పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇచ్చాక వెంటనే మళ్లీ అవే పరీక్షలు నిర్వహించడం లేదు. యూనివర్సిటీ చరిత్రలో మొదటిసారి మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల అవకాశం ఇస్తుండడంతో ఫెయిలైన విద్యార్థులకు మంచి అవకాశంగా భావించవచ్చు.

21వేలకుపైగా రీవాల్యుయేషన్ దరఖాస్తులు

డిగ్రీ కోర్సుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు స్వీకరించగా 21వేలకు పైగా వచ్చాయి. ఈ సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించేలోపే రీవాల్యుయేషన్ ఫలితాలు ఇస్తే బెనిఫిట్స్ పొందిన విద్యార్థులు మళ్లీ రాయాల్సిన అవసరం ఉండదనే విషయాన్ని గుర్తించి త్వరగా ఆ ప్రక్రియ పూర్తిచేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్ఎం, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ తదితర పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) రెండో సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 26వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సౌజన్య గురువారం తెలిపారు. ఈనెల 26, 28, 30, మే 2, 5, 7 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కేయూ వెబ్‌సైట్‌లో ఉందని వారు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

● 16 కిలోల సరుకు స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం : గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 16 కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుజరాత్‌లోని బైరాజీకివాడి వడోదరాకు చెందిన గౌతమ్ భరత్ సింధే తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటి నుంచి రైళ్లలో సమోసాలు అమ్ముతూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో ముంబాయికి చెందిన అర్జున్.. గంజాయి సరఫరా చేస్తే రూ. 5వేలు ఇస్తానని చెప్పగా గౌతమ్ ఒప్పుకున్నాడు. దీంతో నవంబర్‌లో గౌతమ్ ఒడిశాలోని బాలుగం రైల్వే స్టేషన్ వెళ్లి అక్కడ నెహ్రూబాయ్ అనే వ్యక్తి ఇచ్చిన గంజాయి తీసుకుని ముంబైకి వెళ్లి అర్జున్‌కు అప్పగించగా రూ. 5 వేలు ఇచ్చాడు. నాలుగు రోజు క్రితం కూడా మళ్లీ ఇదే తరహాలో గౌతమ్ ఒడిశా వెళ్లి గంజాయి తీసుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ క్రమంలో రైలులో పోలీసులు గంజాయి గుర్తించి తనిఖీ చేస్తున్నారని తెలియడంతో బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగాడు. వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఆటోలో హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడ ఎస్సై కిశోర్, సిబ్బందికి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకునే క్రమంలో తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు.

కూతురు మృతికి కారణమైన తల్లి ..

● వివరాలు వెల్లడించిన సీఐ రాజేశ్

డోర్నకల్: పిల్లలకు పురుగుల మందు తాగించి ఒకరి మృతికి కారణమైన తల్లిని అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేశ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని జోగ్యాతండాకు చెందిన వాంకుడోత్ ఉష ఫిబ్రవరి 5న తన ఇద్దరు పిల్లలు వరుణ్‌తేజ్, నిత్యశ్రీ(05)కు కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాగించడంతో వారు అపస్మారకస్థితికి చేరారు. గమనించిన కుటుంబీకులు పిల్లలను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లో నీలోఫర్‌కు తరలించగా నిత్యశ్రీ చికిత్స పొందుతూ ఫిబ్రవరి 22న మృతి చెందింది. వరుణ్‌తేజ కోలుకోకున్నాడు. కాగా, పిల్లలకు గడ్డిమందు తాగించిన అనంతరం ఉష కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొంది కోలుకుంది. ఈ క్రమంలో నిత్యశ్రీ బాబాయి రాంబాబు ఫిర్యాదు మేరకు తల్లి ఉషను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బి. రాజేశ్ తెలిపారు.